క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



మృతుల కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: స్థానిక ఇందిరానగర్‌లో నివాసముంటున్న హరిజన జయన్న, బంటుపల్లి తిప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష చొప్పున మంజూరవడంతో ఇందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గురువారం తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కౌన్సిలర్లు చలపతి, కిట్టు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి సన్నీ, నాయకులు కల్లుపోతుల సురేష్, గిడ్డయ్య, సికిందర్ పాల్గొన్నారు.

ఎస్‌ఈగా పదోన్నతి



సుధాకర్ కుమార్

ఆదోనిఅర్బన్: డివిజనల్ విద్యుత్‌శాఖ డీఈగా ఉన్న సుధాకర్‌కుమార్‌కు ఎస్‌ఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న ఏడీఈ, ఏఈలు, లైన్‌మెన్లు, కార్మికులు ఆయనకు అభినందనలు తెలిపారు. సుధాకర్ కుమార్ మాట్లాడుతూ ఎస్‌ఈగా పదోన్నతి రావడంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న కౌతాళం జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. కొంతమంది భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

పదవీ విరమణ తప్పనిసరి



ఎంఈఓ శివరాములును సన్మానిస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని ఆదోని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ గీతావాణి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంఈఓ శివరాములు పదవీ విరమణ పొందగా ఆయనను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ 12 యేళ్లుగా ఆదోని ఎంఈఓగా శివరాములు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. మాజీ ఎంపీపీ పంపాపతి, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ నాగరాజు, సెక్రటరీ చంద్రశేఖర్, సూపరింటిండెంట్ విజయశేఖర్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ వర్గీయుల దాడి



గాయపడిన కేశవరెడ్డి, లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి

ఆదోనిఅర్బన్: మండలంలోని గోనబావి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులైన తండ్రీ కుమారులపై టీడీపీ నాయకులు దాడి చేసిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు కేశవరెడ్డి, ఆయన కుమారులు లక్ష్మిరెడ్డి, నాగిరెడ్డి పోలీసులకు తెలిపిన మేరకు వివరాలు.. గ్రామంలో టీకొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని, టీడీపీ నాయకుడైన మూలింటి శేఖన్న అలియాస్ షేక్‌సాబ్ పలుమార్లు మద్యం తాగి వచ్చి మిమ్మల్ని చంపుతామని బెదిరిస్తూ దాడికి దిగేవాడు. ఇప్పటికే గ్రామపెద్దలు రాజీచేశారు. గురువారం ఆయనతో పాటు మంజూర్‌బాషా, వలీబాషా, కాశీంవలి పూటుగా మద్యం సేవించి కొట్టు వద్దకు వచ్చి తనతో పాటు తన కుమారులపై రాళ్లు, కొడవళ్లతో దాడి చేయడంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా గతంలో మూలింటి శేఖన్నపై రౌడీషీటర్ ఉందని, ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పథంలో ఆంధ్రా ముంబయి

- 36వ వార్డు టీజీఎల్ కాలనీలో రూ.2.83 కోట్లతో అభివృద్ధి పనులు
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- కాలనీ వాసులకు తీరిన ఇబ్బందులు

- 36వ వార్డులో టీజీఎల్ కాలనీ, భీరప్ప కాలనీ, మేదర్‌గేరి, తాయమ్మగుడి ఏరియా, కొత్త ఓవర్ బ్రిడ్జి ఏరియా ప్రాంతాలు ఉన్నాయి.

జనాభా – 3,480, మహిళలు – 1,770
పురుషులు – 1,710





పార్కులో పచ్చదనం, క్రీడా, వ్యాయామ పరికరాల ఏర్పాటు



ఆదోనిటౌన్: ఆంధ్రా ముంబయిగా పేరుగాంచిన ఆదోని అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ముఖ్యంగా మౌలిక వసతులైన తాగునీరు, మురుగు కాలువలు, వీధి దీపాలు, సామూహిక మరుగుదొడ్లు, సీసీ రోడ్లు తదితర వాటి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణంలోని 36వ వార్డు టీజీఎల్ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేశారు. నాడు–నేడు, 14, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో అభివృద్ధి పనులు చేశారు. ఇప్పటికే చాలా వరకు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

36వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనులు..

- మేదర్ గేరి నుంచి ముద్రిక ఆంజనేయస్వామి గుడి వరకు మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.12 లక్షలతో 2023లో బీటీ రోడ్డు నిర్మించారు.
- వైఎంకే నగర్–టీజీఎల్ కాలనీ వరకు జనరల్ ఫండ్స్ రూ.90 లక్షలతో బీటీ రోడ్డు 500 మీటర్లు వేశారు.
- 2021లో మట్టి రోడ్డును తొలగించి బీటీ రోడ్డుగా మార్చారు.
- భీరప్పగుడి నుంచి మహావీర్ కాలనీ వరకు 2022లో జనరల్ ఫండ్స్ కింద రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేశారు.
- 2023లో మేదర్‌గేరిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు 700 మీటర్లు వేశారు.
- గతేడాది ఇదే ఏరియాలో 200 మీటర్లు సీసీ రోడ్డును గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో చేపట్టారు.
- భీరప్ప నగర్‌లో జనరల్ ఫండ్స్ కింద ఈ ఏడాది జనవరిలో రూ.12 లక్షలతో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశారు.
- మహావీర్ కాలనీలో అమృత్ పథకం కింద రూ.55 లక్షలతో మున్సిపల్ పార్కును 2023లో ఏర్పాటు చేశారు.



మేదరిగేరిలో నాడు.. మట్టి రోడ్డు,



నేడు.. సీసీ రోడ్డు

- వైఎంకే స్కూల్ వెనుకభాగంలో గుడిసెలు, షెడ్లు వేసుకొని జీవనం సాగిస్తున్న 40 మంది పేదలకు 2021లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.
- రైల్వే ట్రాక్ పక్కన 50 మంది పేదలకు 2021లో అమృత్ పథకం కింద 50 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు.
- జగనన్న కాలనీలో 144 మంది పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు.
- భీరప్పనగర్‌లో నాడు–నేడు పథకం ద్వారా రూ.30 లక్షలతో ప్రభుత్వ పాఠశాలకు రక్షణ గోడ, పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు.
- విక్టోరియాపేటలో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 5 అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ సెంటర్ కోసం రూ.62.50 లక్షలు నాడు–నేడు పథకం కింద ఖర్చు చేశారు.
- నాడు–నేడు పథకం కింద ఏరియా ఆస్పత్రిలో 220 పడకల అత్యాధునిక వసతులతో కూడిన భవనాలు, డైక్ సెంటర్ నిర్మాణం పనులు జరిగాయి.

మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశాం



కొన్నేళ్ల క్రితం వరకు టీజీఎల్ కాలనీ అంటేనే ముళ్ల పొదలతో వనంలా ఉండేది. వైఎస్సార్ హయాంలో కాలనీ కొంతమేర అభివృద్ధి చేశారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అభివృద్ధిలో పట్టణానికి ఆదర్శంగా తీర్చిదిద్దాం. సుమారు రూ.2 కోట్లకు పైగానే నిధులను ఖర్చు చేసి రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి, వీధి దీపాలు ఏర్పాటు చేశాం.

– కె.సందీప్‌రెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్

గతంలో అభివృద్ధి చేయలేదు



మేదర్‌గేరి ప్రాంతం గతంలో అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. ఎరుగదు. ఈ నాలుగున్నరేళ్లలో సీసీ రోడ్లు, కాలువలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి అన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఇంటి ముందు నడవడానికి వీలు లేని విధంగా రోడ్డు ఉండేది. నేడు సీసీ రోడ్డు వేయడంతో ఇబ్బందులు లేవు.

– మేరం శ్రీనివాసులు, మేదర్‌గేరి

ఇబ్బందులు తొలగాయి



40 యేళ్లుగా తాయమ్మగుడి ఏరియాలో రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడ్డాం. మురుగు నీరు, వృథా నీరు బయటకు వెళ్లే వీలు లేక ఎక్కడికక్కడే నిలిచి పోయేవి. దీంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీటి కోసం ఇళ్ల ఎదుట గుంతలు తవ్వుకున్నాం. గుంతలు నిండితే బిందెలతో తోడుకొని రైల్వే ట్రాక్ ప్రాంతంలో పారేబోసేవాళ్లం. ఇప్పుడు రోడ్లు వేసి, మురుగు కాల్వలు ఏర్పాటు చేయడంతో మాకు ఇబ్బందులన్నీ తప్పాయి.

– వై.ఎం.నాగరాజు, తాయమ్మగుడి

డిగ్రీ కళాశాలలో ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయి

ఆదోనిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కౌన్సిలర్, సందీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శివారెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోని మార్కెట్‌యార్డు కమీషన్ ఏజెంట్స్ సహకారంతో 20 కంప్యూటర్లు సమకూర్చామని చెప్పారు. అలాగే కళాశాలకు అవసరమైన ఫర్నీచర్ ఏర్పాటుకు వ్యాపారవేత్తలు షమీర్, చంద్రకాంత్‌రెడ్డి ముందుకురావడం గర్వకారణమన్నారు. జగనన్న చొరవతోనే 40 యేళ్ల కల సాకారమైందన్నారు. కాగా పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నాయకులు దాదాపు 40 యేళ్లుగా పోరాటాలు చేశాయి. డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని 2022 జూలై 15న ఆదోనికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించారు. స్పందించిన జగనన్న ఆరు నెలల్లోనే కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించారు. 2023లో డిగ్రీ కళాశాల ఏర్పాటు, అధ్యాపకుల నియామకం, అడ్మిషన్ల ప్రక్రియ మొదలైంది. మార్కెట్‌యార్డు కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు రాజాగౌడ్, శ్రీనివాసులు, పద్మనాభయ్య, చంద్రకాంత్‌రెడ్డి, వీరభద్రగౌడ్, మల్లికార్జున పాల్గొన్నారు.

కమనీయం.. రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవం







ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి, శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తాదులు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది, కొల్మాన్‌పేట గ్రామ ప్రజల ఆరాధ్య దైవం రామలింగేశ్వర స్వామి, రాజరాజేశ్వరి దేవి ఆలయ ఏడవ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేకువజామున నుంచి ఆలయ ధర్మకర్త గుడిసె రామలింగప్ప, రామలింగమ్మ దంపతుల నేతృత్వంలో ఆదోని రాజయోగి పంచలింగేశ్వర స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. స్వామి వారికి జలాభిషేకం, మహా రుద్రాభిషేకం, వెండి కవచ అలంకరణ, ఆకు పూజ, గణపతి, గాయత్రీ, నవగ్రహా, రుద్ర, లలితా హోమాలు వేదమంత్రోచ్చారణ మధ్య మహా మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ప్రత్యేకంగా పంచ లోహాలతో శివపార్వతుల విగ్రహాలు తయారు చేసి మేళతాళాల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తాదులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని నారికేలాలు సమర్పించి పూజలు చేశారు. భక్తాదులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గుడిసె కృష్ణమ్మ, శ్రీరాములు, జ్ఞానేష్, మంగమ్మ, ఈఓ రాంప్రసాద్, హనుమంతు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

కౌతాళం: ఆరోగ్యం పట్ల ఎవరూ నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ హిందూప్రకాశ్ రెడ్డి, గుండె వైద్య నిపుణుడు అఖిల్ రాణా, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య సూచించారు. గురువారం కౌతాళంలో సీపీఎం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులు డాక్టర్లుగా చెలామణి అవుతూ అన్ని జబ్బులకు చికిత్స చేస్తున్నారని, దీని వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం ఏర్పడుతుందన్నారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని, పెద్ద జబ్బులకు స్పెషలిస్ట్ డాక్టర్ల వద్ద వైద్యం తీసుకోవాలని సూచించారు. మల్లయ్య మాట్లాడుతూ.. ఆర్థిక స్తోమత లేని పేదలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. శిబిరంలో 112 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా గుండె జబ్బులు ఉన్న 18 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. ఏఎన్‌ఎంలు కరిముల్లా, అంజలి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో ఈసీజీ తీస్తున్న డాక్టర్

పశువుల దొంగల అరెస్ట్

- అందుకే స్కార్పియో చోరీ
- రెండు వాహనాలు స్వాధీనం
- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో మరో ముగ్గురు
- నిందితుల్లో ఐదుగురు హర్యానా, ఇద్దరు హిందూపురం వాసులు



వాహనాలు, నిందితులను చూపుతున్న పోలీసులు

ఆదోనిఅర్బన్: గత నెల 22న తెల్లవారుజామున జరిగిన స్కార్పియో దొంగతనం కేసును ఆదోని త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. స్కార్పియో వెనక సీట్లను తీసివేసి దొంగలించిన పశువులను అందులో తీసుకెళ్లాలని ఐదుగురు దొంగలు పట్టణంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్కార్పియో వాహనాన్ని దొంగలించగా నాడు కేసు నమోదైంది. గురువారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురు నిందితులు, రెండు వాహనాలను స్వాధీనం చేసుకొని మీడియా ఎదుట ప్రదర్శించారు. త్రీటౌన్ సీఐ నరసింహరాజు, టూటౌన్ సీఐ గోపీచంద్, తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. హర్యానా రాష్ట్రం పల్వాన్ జిల్లా ఉతావర్ గ్రామానికి చెందిన మౌఅక్రమ్, ఇర్షద్ స్నేహితులు. వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే జల్సాలకు అలవాటుపడి డబ్బు చాలక పోవడంతో అక్రమంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. వీరికి అదే రాష్ట్రంలోని తారూరు జిల్లా సునారీ గ్రామానికి చెందిన మహ్మద్ అరీఫ్ పరిచయమయ్యాడు. ఆవు దూడలను దొంగతనం చేసి తమకు అప్పజెబితే రోజుకు రూ.2,500 ఇస్తానని మహ్మద్ అరీఫ్ చెప్పాడు. ఇదిలా ఉండగా..సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన ఫరూక్, అతని తమ్ముడు వసీం అక్రం మటన్ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మహ్మద్ అరీఫ్‌తో పరిచయం ఉంది. వీరు రోడ్లపై, పొలాల వద్దనున్న ఆవుదూడలను దొంగతనం చేసి ఫరూక్, వసీంకు ఇస్తే వారు మహ్మద్ అరీఫ్‌కు డబ్బులు ఇచ్చేవారు. దొంగతనం చేసేందుకు కావాల్సిన వాహనాన్ని వీరిద్దరే ఏర్పాటు చేసేవారు. ఎవరికీ అనుమానం రాకుండా ఫరూక్, వసీం అక్రమ్ మటన్ షాపుపైన ఉన్న షెడ్‌లో హర్యానాకు చెందిన వారందరికీ వసతి ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా హర్యానా రాష్ట్రానికి చెందిన మౌఅక్రమ్, ఇర్షద్, కమల్ అలీ, అసీఫ్, మహ్మద్ అరీఫ్ గత నెల 16న హిందూపురం వచ్చారు. మహ్మద్ అరీఫ్ వారిని ఫరూక్, వసీం అక్రమ్‌కు పరిచయం చేశాడు. వారంతా గత నెల 21న రాత్రి సఫారీ వాహనంలో ఆదోనికి వచ్చారు. ఆవుదూడలు, ఫోర్ వీలర్ వాహనం కోసం వెతికారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న స్కార్పియోను కొద్ది దూరం తోసుకుంటూ వెళ్లి సఫారీ వాహనానికి తాడుతో కట్టుకొని ఊరుబయటకు తీసుకెళ్లి అక్కడి నుంచి హిందూపురం తీసుకెళ్లారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం, సీసీటీవీ ఫుటేజీల ద్వారా వివరాలు సేకరించగా.. హిందూపురంలో వెళ్లినట్లు తెలుసుకున్నారు. అక్కడ రహ్మత్‌పురాలోని ఆటోనగర్ సర్కిల్ వద్ద వసీం అక్రమ్, హర్యానా రాష్ట్రానికి చెందిన కమల్‌అలీ, మౌఅక్రమ్, ఆసీఫ్‌ను అరెస్టు చేసి, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా హిందూపురానికి చెందిన ఫరూక్, హర్యానాకు చెందిన మహ్మద్‌అరీఫ్, ఇర్షద్ తప్పించుకున్నారని చెప్పారు. కేసును ఛేదించిన వారిలో సిబ్బంది నరేంద్ర, హాజీబాషా, పరశురామ్, శ్రీనివాసులు, సోమేష్‌ను ఎస్పీ క్రిష్ణకాంత్, డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారన్నారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

ఆదోనిటౌన్: మున్సిపాలిటీలో గురువారం తెల్లవారక ముందే పింఛన్ల పండుగ ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. పట్టణంలోని 42 వార్డుల్లో 17,399 మంది పింఛన్‌దారులుండగా, రూ.5,24,68,000 మొత్తం మంజూరైందని అధికారులు తెలిపారు.



మహిళకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ రేణుక

కోలుకోలేక ఎంపీటీసీ సభ్యుడి మృతి



మాలదాసరి మల్లికార్జున, (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మాలదాసరి మల్లికార్జున (32) కర్నూలులో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గత నెల 28న రాత్రి మల్లికార్జున మాధవరం నుంచి స్వగ్రామం వందగల్లుకు బైక్‌పై వస్తుండగా రచ్చుమర్రి సమీపంలో అదుపుతప్పి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి కోమాలోకి వెళ్లడంతో మూడు రోజుల పాటు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మల్లికార్జున గత ఎంపీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుడికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ కొరవంజమ్మ, మాజీ ఎంపీటీసీ కాల్వ లక్ష్మయ్య మృతుడికి సంతాపం తెలిపారు. చిన్న వయస్సులోనే రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ఆకస్మిక మృతితో భార్య పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: కుప్పగల్ గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య గురువారం రాత్రి తెలిపారు. కుమార్ కర్ణాటకకు చెందిన 90 ఎం.ఎల్. పరిమాణం గల 42 టెట్రా ప్యాకెట్లను కలిగి ఉండడంతో స్వాధీనం చేసుకొని, అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

రేపు గోపాలదాసు ఆరాధన

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం గోపాలదాసు ఆరాధనోత్సవం ఉంటుందని ఆలయ మేనేజర్ వాసుదేవరావు గురువారం తెలిపారు. మంత్రాలయం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు గోపాలదాసు ఆరాధనోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు.

కార్మికులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఆదోనిరూరల్: పంచాయతీ కార్మికులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. గురువారం మేజర్ పంచాయతీ మండిగిరిలో ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు యూనిఫాం,సబ్బులు, కొబ్బరినూనె డబ్బాలను మాజీ సర్పంచ్ శేషిరెడ్డితో కలిసి అందజేశారు. మొత్తం 45 మంది పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సెక్షన్ కార్మికులకు వీటిని అందించినట్లు తెలిపారు.పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, నాయకులు ఉలిగప్ప, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి

ఘనంగా మడివేళప్ప జయంతి

మంత్రాలయం: రజకుల కుల దైవం మడివేళప్ప జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మంత్రాలయంలో నిర్వహించిన మడివేళప్ప జయంతి కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా మడివేళప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నారికేలాలు సమర్పించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయంలో రజకులందరూ తమ వెంట నడుస్తూ తమతో ఉండడం అభినందనీయమన్నారు. రజకులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మడివేళప్ప చిత్రపటాన్ని మంత్రాలయంలో పురవీధుల్లో ఊరేగించారు. పార్టీ అధ్యక్షుడు భీమా రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మల్లికార్జున, ఉపసర్పంచ్ పరమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదోని సెంట్రల్: నియోజకవర్గంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు స్త్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదోని అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఉమామహేశ్వరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దాదపు 12 పోస్టులు ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు 7వ తరగతి ఉత్తీర్ణురాలై ఉండాలి. 10వ తరగతి లేదా అంతకన్నా పై చదువులు చదివిన వారికి ప్రాధాన్యత ఉంటుంది, 2023 జూలై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరముల లోపు ఉన్నవారు, వివాహితురాలై, స్థానికంగా నివాసం ఉండి, అదే గ్రామం, వార్డుకు చెందిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఇక ఎస్సీ, ఎస్టీల్లో 21వ సంవత్సరములు వారు లేనిచో 18 సంవత్సరాలు పైబడిన వారిని పరిగణలోకి తీసుకుంటారు. ఇందుకు అవసరమైన ధ్రువ పత్రాలను జతపరిచి ఈనెల7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆదోని సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

కోసిగి: మంత్రాలయం నియోజకవర్గంలోని ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ మంజూరైందని, ఖాళీ స్థానాలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ నాగమణి గురువారం తెలిపారు. నియోజకవర్గ పరిధిలో కార్యకర్త పోస్టులు –3, ఆయా పోస్టులు 8 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. కార్యకర్త పోస్టుకు 10వ తరగతి ఉత్తీర్ణత, ఆయా పోస్టులకు 7వ తరగతి పాసై ఉండాలి. 21 – 35 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులు. అభ్యర్థి వివాహితురాలై స్థానికంగా నివాసం ఉండారు. అలాగే పుట్టిన తేదీ లేక వయసు ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత మార్కుల లిస్ట్, టీసీ, ఆధార్ కార్డు, అప్లికేషన్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈనెల ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులను మంత్రాలయం ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

ఖాళీల వివరాలు..

ఖాళీ స్థలం	అంగన్‌వాడీ సెంటర్	కేటగిరి/ కులము
హవ్వన్న పేట	సెంటర్ -1	ఈడబ్ల్యూఎస్
సుల్తానపురం	-	ఓసీ
పాండవగల్లు	-	బీసీ-ఏ
బోయగేరి	సెంటర్ -2	ఓసీ
కుప్పగల్	సెంటర్ -3	ఓసీ
పెద్దతుంబళం	సెంటర్ -3	ఈడబ్ల్యూఎస్
మదిరె	సెంటర్ -2	ఎస్టీ
పెద్దహరివాణం	సెంటర్ -8	ఓసీ
సాదాపురం	సెంటర్ -2	బీసీ-బి
ఆరెకల్లు	సెంటర్-2	ఓసీ
నిజాముద్దీన్ కాలనీ	సెంటర్ -1	ఓసీ
హవ్వన్న పేట	సెంటర్-2	ఓసీ